పొద్దస్తమానం పడిగాపులు



భూత్పూర్‌లోని ఫర్టిలైజర్స్ దుకాణం ఎదుట వేచి ఉన్న రైతులు



మహమ్మదాబాద్‌లో ఎరువుల దుకాణం వద్ద పడిగాపులుగాస్తున్న రైతులు

- యూరియా కోసం రైతుల అవస్థలు
- దుకాణాల ఎదుట గంటల తరబడి నిరీక్షణ

భూత్పూర్: రైతులు యూరియా కోసం తెల్లవారు జామున నుంచి ఫర్టిలైజర్స్ దుకాణాల ఎదుట ఎదురుచూస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని రమేశ్ బ్రదర్స్, మన గ్రోమోర్ కేంద్రంలో రెండు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతులకు యూరియాను సరఫరా చేశారు.

మహమ్మదాబాద్: యూరియా కోసం రైతులు ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు గాస్తు న్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మనగ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ఉదయం నుంచే వందలాదిమంది రైతులు జమఅయ్యారు. ఎరువుల దుకాణం యజమాని కూడా యూరియా వస్తదా? రాదా అన్న సమాధానం చెప్పకపోవడంతో రోజంతా అక్కడే పడిగాపులు గాయాల్సి వస్తున్నదని తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాలకు యూరియా సరఫరా చేస్తే రైతులకు ఇలాంటి పరిస్థితి రాదని ఒక్కోరైతు టోకెన్ తీసుకుని కూడా రెండు మూడు రోజులు తిరగాల్సి వస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరుతున్నారు.

నవాబుపేట: యూరియా కోసం అన్నదాతలు శుక్రవారం మండల కేంద్రంలో నిరసనకు దిగారు. నవాబుపేట–మహబూబ్‌నగర్ రోడ్డుపై బైఠాయించి యూరియా అందే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సహకారం సంఘంలో యూరియా ఇస్తారని నిరీక్షించారు. తీరా యూరియా రాలేదని తెలుసుకుని ఏకంగా రోడ్డేక్కారు. మండల కేంద్రంలోని కొండాపూర్ చౌరస్తాలో రైతులు నిరసనకు దిగారు. రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు విస్మరించారు. ఒక్కొక్కరుగా రైతులు రోడ్డుపై చేరుతుండడంతో ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ఎస్ఐ విక్రమ్, మండల అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రెండురోజుల్లో అందించే ఏర్పాటు చేస్తామని రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

జడ్చర్ల టౌన్: యూరియాకోసం రైతుల పాట్లు తప్పడం లేదు. శుక్రవారం పట్టణంలోని కోరమాండల్ మనగ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుంచే బారులుదీరారు. గంటల తరబడి వేచి ఉండి యూరియాను తీసుకుని వెళ్లారు.



నవాబుపేటలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు



కోరమాండల్ ఆగ్రో కేంద్రం వద్ద బారులుదీరిన రైతులు

ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు

- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రతిరైతుకు యూరియా అందేలా సక్రమంగా పంపిణీకి చర్యలు తీసుకోవాలని, జిల్లాకు వచ్చిన 600 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అన్ని మండలాలకు సరఫరా చేయాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఏఓ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులతో కలెక్టర్ యూరియా పంపిణీపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. అన్ని మండల స్టాక్‌పాయింట్లకు యూరియా సరఫరా చేసి మండలంలో ఏ గ్రామంలో రైతుకు యూరియా అందలేదో వారికి వ్యవసాయ విస్తరణ అధికారులు రైతువేదికల్లో టోకెన్‌లు జారీచేసి యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టోకెన్ తీసుకున్న రైతు సంబంధిత డీలర్ వద్దకు వెళ్లి యూరియా తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీఏఓ వెంకటేశ్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

హన్వాడ: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని వేపూర్‌ను సందర్శించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకున్న పావనితో మాట్లాడారు. 540 చదరపు అడుగులలో నిర్మాణం చేసుకున్న పావని ఇంటిని కలియతిరిగి నిర్మాణానికి సంబంధించిన డబ్బులు విడతలవారీగా సరిగ్గా అందాయా.. అని తెలుసుకున్నారు. ఇందుకు ఆమె స్పందిస్తూ సకాలంలో డబ్బులు తన అకౌంట్లో జమ అయినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఇళ్లు చాలా అందంగా నిర్మించారని అలాగే అందరూ తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్రామంలోని పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలోని ఆయుష్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు, మందుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. కేంద్రం చుట్టూ అలుముకున్న పిచ్చిమొక్కలు, ఇతర కంపచెట్లను తొలగించాలని ఆదేశించారు. అనంతరం వెటర్నరీ సబ్‌సెంటర్‌ను సందర్శించారు. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వెటర్నరీ అసిస్టెంట్ నరేశ్ గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అతడికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

క్లుప్తంగా

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



దేవరకద్ర: మున్సిపాలిటీ పరిధిలోని తెలుగువాడలో శుక్రవారం పలువురు బాధితులను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. దివంగత మాజీ ఎంపీపీ చిన్నయ్య భార్య యాదమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న శ్రీనివాసులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటామని తెలిపారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, మండల నాయకులు కరణంరాజు, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కొండారెడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు, సత్యంసాగర్, రాధాకృష్ణ, నరేశ్, వెంకట్రాములు, భాస్కర్‌రెడ్డి, బాలగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను రక్షించిన ఎస్ఐకి సన్మానం



నవాబుపేట: నవాబుపేట ఎస్ఐ విక్రమ్ రెండు రోజుల క్రితం అంతర్రాష్ట్ర గోవుల దొంగల ముఠాను పట్టుకుని అరెస్ట్ చేయడంతో పాటు గోవులను రైతులకు అందించడంలో క్రియాశీల పాత్ర పోషించిన సిబ్బందిని వీహెచ్‌పీ నాయకులు శుక్రవారం శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ధర్మప్రసార బాధ్యుడు బాలశివుడు, చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కంచె ధ్వంసం చేసిన వారిపై కేసు

నవాబుపేట: మండలంలోని లోకిరేవు శివారులో సర్వేనంబర్ 206లో ఉన్న పొలంలో వేసిన కంచెను ధ్వంసం చేసిన వారిపై బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లోకిరేవు శివారులో గతంలో 2023 సంవత్సరంలో భూమిని హైదరాబాద్‌కు చెందిన గూడూర్ మనోహర్ కొనుగోలు చేశాడు. అట్టి భూమిలో పామాయిల్ తోటలు వేసి సాగు చేస్తున్నాడు. కాగా, గురువారం చౌక్కంపేటకు చెందిన కృష్ణయ్య, శేఖర్, రాములు, కొండాపూర్ శ్రీను పొలానికి వేసిన కంచెను అక్రమంగా ధ్వంసం చేసినట్లు బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల బెడద తప్పించండి



దేవరకద్ర రూరల్: వెంకటగిరిలో కుక్కల బెడద తొలగించాలని గ్రామస్తులు శుక్రవారం కౌకుంట్ల ఎంపీడీఓ శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కొన్ని రోజులుగా గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ప్రజలు ముఖ్యంగా చిన్నారుల మీద దాడులు చేస్తున్నాయన్నారు. వాటి బెడద తొలగించాలని కోరారు. అలాగే గ్రామంలో వీధిదీపాలు లేక రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంట్లోకి రానివ్వడంలేదని ఫిర్యాదు

నవాబుపేట: తన పేరున ఉన్న ఇంటిని తనకు తెలియకుండా గుట్టుచప్పుడుగా ఆన్‌లైన్ చేసుకని తనను ఇంట్లోకి రానివ్వడంలేదని బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన కోస్గి లింగమ్మకు నలుగురు కుమారులు, ఆరుగురు కూతుళ్లు. కాగా, తన పెద్ద కుమారుడు వెంకటయ్యతోపాటు లింగమ్మ సైతం ఇంటిని నిర్మించుకుంది. తన పేరున ఉన్న ఇల్లును తన కుమారుడు వెంకటయ్య గుట్టుచప్పుడుగా తనను మోసం చేసి ఆన్‌లైన్ చేసుకున్నాడు. ఈ విషయంలో నిలదీసి అడిగి ఇంట్లోకి వెళ్తుంటే అడ్డుకున్నాడని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ

దేవరకద్ర: మండలంలోని గూరకొండలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఈ రవీందర్ భవన నిర్మాణానికి ముగ్గు వేసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు ఉసెనప్ప, రాంరెడ్డి, అశోక్‌కుమార్, కొండారెడ్డి పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై రైతులకు సూచనలు

అడ్డాకుల: మూసాపేట మండలం నందిపేటలో రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. పత్తి, వరిలో ప్రస్తుత వాతావరణానికి ఆశించే చీడపీడలు, వాటి నివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచనలు చేశారు. పత్తి పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ముఖ్యంగా రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగులు, పేనుబంక ఆకుల కింద చేరి రసం పీల్చడంతో ఆకు కొనల నుంచి ఎండిపోయి రాలిపోవడం జరుగుతుందని రైతులకు వివరించారు. దీని నివారణకు ఎసిటంప్రైడ్ 80 గ్రాములు లేదా థయోమెథాహక్సిన్ 80 గ్రాములు ఎకరాకు రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత, ఆకుమచ్చ తెగులు సోకుతున్నాయని వీటి నివారణకు కార్బోహైడ్రోక్లోరైడ్ 400 ఎంఎల్, సాఫ్ అనే మందు 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ అనిల్‌కుమార్

పచ్చదనం–పరిశుభ్రత అందరి బాధ్యత

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రతను పెంచేందుకు ప్రతి ఒక్క విద్యార్థి తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈఓ బలరాం అన్నారు. శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన నినాదాల కరదీపికను ఎంఈఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం, నాగేంద్రమ్మ, రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్వినీచంద్రశేఖర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ ఘర్ నిర్మించొద్దని వినతులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ కళాభవన్ ప్రాంగణంలో ఉర్దూ ఘర్ భవనం నిర్మించరాదని అంబేద్కర్ కళాభవనం పరిరక్షణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి పేషీ ప్రజాభవన్ ప్రణాళిక కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావును కూడా కలిసి ఉర్దూఘర్ భవనం నిర్మించకుండా చూడాలని కోరినట్లు పరిరక్షణ కమిటీ చైర్మన్ సింగిరెడ్డి పరమేశ్వర్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు నాగరాజు, కన్వీనర్ రమేశ్ తెలిపారు. వీరితోపాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం అందించామని, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర నర్సింహులు, గోపాల్, శ్రీవల్లి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంచాయతీ భవనానికి భూమిపూజ



దేవరకద్ర రూరల్: వెంకటాయపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు భూమిపూజ చేశారు. గ్రామంలో గతంలో ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్‌వైస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, కార్యదర్శి శివ, గ్రామ నాయకులు రంగయ్యగౌడ్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భవనం నిర్మాణ పనుల పరిశీలన



మున్సిపల్ భవన పరిశీలనలో చైర్‌పర్సన్, కమిషనర్, ఈఈలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణం పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి శుక్రవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు సతీశ్‌కుమార్, రమేశ్, లత పాల్గొన్నారు. అనంతరం 7వ వార్డులో నిర్మిస్తున్న మురుగుకాల్వ నిర్మాణ పనులు సైతం పరిశీలించారు. నాణ్యతతో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. తర్వాత 16వ వార్డులో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించారు.

డిగ్రీలో చేరేందుకు 15, 16న స్పాట్ అడ్మిషన్లు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుకన్య తెలియజేశారు. డిగ్రీలోని వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వంటమనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ వద్ద ఉన్న కేజీబీవీలో ఖాళీగా ఉన్న వంట మనిషి పోస్టుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్ఓ శంకరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అర్హులైన స్థానిక మహిళలు ఈనెల 15లోగా కేజీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అసంపూర్తి భవనాన్ని పరిశీలించిన స్పెషల్ కలెక్టర్

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని శుక్రవారం స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో ఉపకరణాలు ఉపయోగిస్తూ విద్యాబోధన చేస్తే వారికి సులువుగా అర్థమౌతుందని ఉపాధ్యాయులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న భవనం పూర్తిచేయడానికి ఎంత ఖర్చవుతుందో ఎస్టిమేట్ చేసి నివేదిక ఇవ్వాలని పీఆర్ ఏఈని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ మంజుల తదితరులు ఉన్నారు.



తిర్మలాపూర్‌లో విద్యార్థిని చదివిస్తున్న స్పెషల్ కలెక్టర్ మధుసూదన్

‘వెంకటేశ్ హత్యపై విచారణ చేపట్టాలి’

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మాచన్‌పల్లికి చెందిన వెంకటేశ్ ముదిరాజ్ అనుమానాస్పద మృతిపై పోలీసులు కచ్చితంగా విచారణ జరిపి దోషులను చట్టపరంగా శిక్షించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వెంకటేష్ ముదిరాజ్ మృతిపై అనుమానాలను నివృత్తి చేసి, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రేమ వ్యవహారమే మృతికి కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో పోలీసులు విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకొని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వెంకటేశ్ ప్రేమించిన యువతి కనిపించకపోవడంతో ఆమె బంధువులు వెంకటేశ్‌ని కొట్టి ఆచూకీ చెప్పాలని బయటకు తీసుకెళ్లి బలవంతం చేసిన మరుసటి రోజే చెట్టుకు ఉరివేసుకొని ఉండడం ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడం చూస్తే ఇది హత్య చేసి ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని శరీరంపై గాయాలు, వాతలు ఉన్నాయని, ముమ్మాటికి హత్యగా భావించబడ్డాడని అనుమానం వ్యక్తం చేశారు.

‘ఆది కర్మయోగి’ ప్రణాళికలు రూపొందించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలుకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. ఆది కర్మయోగి అభియాన్‌లో జిల్లా గిరిజన శాఖ ఆధ్వర్యంలో మయూరీ పార్క్‌లో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండలస్థాయి అధికారులకు (బీఎంటీ– బ్లాక్ మాస్టర్ ట్రైనర్స్)లకు నిర్వహించిన శిక్షణలో భాగంగా శుక్రవారం ముగింపు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలస్థాయిలో శిక్షణ పొందిన వివిధ శాఖల బ్లాక్ మాస్టర్ ట్రైనర్‌లు గ్రామాల్లో శిక్షణనందించాలన్నారు. కార్యక్రమం రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన ఏడుగురు డీఎంటీ(డిస్ట్రిక్ మాస్టర్ ట్రైనర్స్)లతో రెండు గ్రూపులుగా విభజించి శిక్షణ నిర్వహించబడిందన్నారు. అనంతరం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రబారి ప్రదీప్‌సింగ్, డీటీడీఓ జనార్దన్, మిషన్ భగీరథ డీఈఈ అర్చన, ప్రసన్న, హనుమంత్, డీటీడీఓ సీనియర్ అసిస్టెంట్, డీఆర్‌డీఏ అడ్మిన్ అసిస్టెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఇతర అధికారులు

విద్యార్థుల భోజనంపై శ్రద్ధచూపాలి

నవాబుపేట: హాస్టల్ విద్యార్థుల భోజనంపై వార్డన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సోషల్ వెల్ఫేర్ డీడీ సునీత సూచించారు. శుక్రవారం ఆమె మండల అధికారులతో కలిసి మండలంలోని యన్మన్‌గండ్ల బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలుర హాస్టల్‌లో అల్పాహారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం బాధ్యతగా నడుచుకుని వారికి భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మెనూతోపాటు విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వారి ఆరోగ్యంపై దృష్టిసారించి వైద్యశిబిరాలు నిర్వహించాలని వివరించారు. విద్యార్థులు తమ చదువుపై దృష్టిసారించాలని సూచించారు. ఆమెవెంట ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్, హాస్టల్ వార్డెన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



యన్మన్‌గండ్ల బాలుర హాస్టల్‌లో అల్పాహారం పరిశీలిస్తున్న డీడీ సునీత

పాటుకాల్వ దారి మళ్లించడంపై విచారణ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని వెంచర్‌లో పాటుకాల్వను దారి మళ్లించడంపై జోసెఫ్ చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఇరిగేషన్ డీఈ కృష్ణ విచారణ చేపట్టారు. పాటుకాల్వను దారి మళ్లించడంతోపాటు ఇరుకుగా మురుగు కాల్వలు నిర్మించడంతో వరదనీరు వెళ్లలేక తన పొలంలోకి వస్తున్నాయని బాధితుడు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన శుక్రవారం పాటుకాల్వ దారిమళ్లించడాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో ఫిర్యాదు సమర్పిస్తే విచారణ చేస్తామని డీఈ బాధితుడికి తెలియజేశారు. తాము పాటుకాల్వ దెబ్బతినకుండా వెంచర్ చేసుకోమని అనుమతులు ఇచ్చామని, కాల్వ దెబ్బతినకుండా చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేనని వెల్లడించారు. అయినప్పటికీ ఫిర్యాదు స్వీకరించి తగు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆయనవెంట వార్డుకౌన్సిలర్ సతీశ్ ఉన్నారు.



విచారణ చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

సివిల్ సప్లయ్ పాపం.. విద్యార్థినులకు శాపం



డార్మెటరీలో కింద కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థినులు

- పురుగుల అన్నంతో అవస్థలు
- సమస్యలతో సతమతం

రాజాపూర్(బాలానగర్): గురుకుల పాఠశాలలు సమస్యలతో సతమతమవుతున్నాయి. విద్యార్థులకు పౌష్టికారం అందించి నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. బాలానగర్ మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ గురుకుల రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థినులు అందుకు అనుగుణంగా నాటినుంచి నేటివరకు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 642 మంది విద్యనభ్యశిస్తున్నారు. చాలా ఏళ్లకిందట నిర్మించిన తరగతి గదులు, డార్మెటరీలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు డార్మెటరీలు మాత్రమే ఉన్నాయి. అవికూడా పైకప్పు స్లాబ్ ఊడి పడుతోంది. పాఠశాల ఆవరణలో వర్షాకాలం కావడంతో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి దోమల బెడద ఎక్కువైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సివిల్‌సప్లయ్ అధికారుల నిర్లక్షమో లేక అధికారుల అలసత్వమోగత బుధవారం బియ్యంలో పురుగులు రావడంతో అదే బియ్యాని వండి వడ్డించడంతో విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు విద్యార్థినుల తల్లిదండ్రుల వరకు వెళ్లింది. అదేరోజు ఈ విషయాన్ని ఉపాధ్యాయులు సంబంధిత సివిల్ సప్లయ్ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లి లిఖిత పూర్వకంగా సంబంధిత డీఎస్ఓకు సమాచారం ఇచ్చి సివిల్‌సప్లయ్ నుంచి వచ్చిన బియ్యాన్ని పక్కనపెట్టి బాలానగర్ మండల శివారులోని ఏకలవ్య గురుకుల పాఠశాల నుంచి బియ్యాన్ని తీసుకొచ్చి వండి వడ్డించారు.



పెచ్చులూడిపడుతున్న పైకప్పు

ఆరు క్వింటాళ్ల బియ్యం ఇలా వచ్చాయి

సివిల్ సప్లయ్ అధికారులు పంపిన ఆరు క్వింటాళ్ల బియ్యం ఇలా వచ్చాయి. అయినా బియ్యం క్లీన్ చేయించి వండిస్తున్నాం. బుధవారం ఒక్కరోజు మాత్రం ఇబ్బంది వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చాం.

– సౌమ్య, ప్రిన్సిపాల్, బాలానగర్ గురుకుల పాఠశాల

‘మత సామరస్యానికి పోరాడింది కమ్యూనిస్టులే’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మత సామరస్యం, స్వాతంత్ర్యం కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏచూరి సీతారాం మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాములు మాట్లాడారు. ఈనెల 10నుంచి 17వ తేదీ వరకు కొనసాగే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పద్మ, రాంరెడ్డి, మోహన్, కురుమూర్తి, చంద్రకాంత్, రాజ్‌కుమార్, జగన్, లక్ష్మయ్య, ఖమరలీ, సురేశ్, శివలీల, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం, సీసీకి సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ మండలం ఏపీఎంగా పనిచేస్తూ జడ్చర్ల మండలానికి బదిలీ అయిన మాధవి, వెలుగు సీసీ నాగలక్ష్మిని శుక్రవారం సన్మానించారు. మండలంలోని మాచన్‌పల్లి రైతువేదికలో బదిలీ అయిన ఏపీఎం మాధవి, సీసీ నాగలక్ష్మికి ఎంపీడీఓ కరుణశ్రీ, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు సుమంగళి, లహరి, చంద్రకళ, మేనక, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.